క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-1, పొలిటికల్ సైన్స్-1 పోస్టులకు ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు దరఖాస్తులు కళాశాలలో అందించాలన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సుడా నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. నగరంలోని 26, 39, 31 డివిజన్‌లలో పర్యటించిన వారు అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో సుడా, ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దండగల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై విచారణ చేపట్టాలి

ఖమ్మంమామిళ్లగూడెం: రఘునాథపాలెం మండలంలోని పువ్వాడ ఉదయ్‌నగర్ గ్రామ పంచాయతీలో నిరుపేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యాన శుక్రవారం డీఆర్‌ఓ శిరీషకు వినతి పత్రం అందజేశారు. 2009-10 సంవత్సరంలో జారీ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీలో అనేక అవకతవకలు జరిగినందున స్థలాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భద్రూనాయక్, జంపా, రవీందర్, ఉపేంద్రబాయి, కిషన్, మదన్, వీరన్న, శ్రీనివాస్, చిన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

నేలకొండపల్లి: కోదాడ-కురవి జాతీయ రహదారి 365(ఏ) కోసం భూ సేకరణలో తనకు అన్యాయం జరిగిందని బాధితుడు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ రీ సర్వే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పైనంపల్లిలో యత్రా వెంకటసత్యనారాయణ భూసేకరణలో భాగంగా తన ఇంట్లో కొన్ని భాగాలను వాల్యుయేషన్ రిపోర్టులో పొందుపరచకపోవడంతో నిర్మాణ పరిహారం విలువ చాలా తక్కువగా వచ్చిందని బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికను అందించాలని ఆదేశించారు.

చెరువులకు ప్రమాదం లేదు..

నేలకొండపల్లి: సబ్ డివిజన్‌లో చెరువులు, కుంటలకు ఎలాంటి ప్రమాదం లేదని ఇరిగేషన్ నేలకొండపల్లి సబ్ డివిజన్ డీఈఈ మన్మథరావు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యాన శుక్రవారం మండలంలోని పలు చెరువులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.చెరువుమాధారం చెరువు నాలుగున్నర అడుగులకు నీటి మట్టం చేరుకోగా.. లాక్‌ల వద్ద, చుట్టు పక్కల ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. గతంలో ఎక్కడైనా బుంగలు, గండ్లు పడ్డ ఘటనలను దృష్టిలో ఉంచుకుని నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నరేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం నింపేందుకు కృషి



అవగాహన కల్పిస్తున్న శైలేంద్ర

ఖమ్మం రూరల్: ఓటర్లలో చైతన్యం నింపేందుకు కృషి చేయాలని మాస్టర్ ట్రైనర్ శైలేంద్ర సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణ, ఓటర్ల మార్పులు, చేర్పులు తదితర వివరాలను ఓటర్లకు వివరించాలని సూచించారు. ఈవీఎంలు తదితర అంశాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుమ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	ఓపెన్ హైమర్
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	హత్య
శ్రీనివాస	హిండింబ

- ఖమ్మంగాంధీచౌక్

సారూ.. ముద్ద దిగట్లే!

గిరిజన వసతిగృహాల్లో నాసిరకంగా భోజనం

- తినలేక చెత్త డబ్బాల్లో పడేస్తున్న విద్యార్థినులు
- అర్ధాకలితో గడపాల్సి వస్తున్న వైనం
- బియ్యం బాగాలేదని సాకులు చెబుతున్న అధికారులు
- పట్టించుకోని డీడీ, ఏటీడీఓలు





ఎన్నెస్పీ క్యాంపులో ఎస్టీ మహిళా కళాశాల వసతి గృహంలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు (ఇన్‌సెట్) తినలేక చెత్త డబ్బాలో వేసిన భోజనం

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల ఆకలి తీరడం లేదు. నాసిరకం అన్నంతో విద్యార్థినులు అర్ధాకలితోనే గడపాల్సిన పరిస్థితులు వసతిగృహాల్లో నెలకొన్నాయి. ఆకలిగా ఉన్నా.. నోట పెట్టుకోవడానికి కూడా వీలులేని విధంగా అన్నం ఉండడంతో ప్రతి రోజు కేజీల కొద్ది అన్నం చెత్త బుట్ట పాలవుతోంది. ఇది ఎక్కడో కాదండి ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల గిరిజన మహిళా కళాశాల వసతిగృహంలోని దుస్థితి. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం కాదుగదా.. కనీసం ఆకలి తీర్చుకునేందుకు కూడా అవకాశం లేని భోజనం అందుతోంది. దీంతో విద్యార్థినిలు అర్ధాకలితో చదువుపై దృష్టి సారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక వసతిగృహంలో భోజనం బాగుండడం లేదని విద్యార్థినిలు విద్యార్థి సంఘాల నాయకులకు చెప్పడంతో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సదరు వసతిగృహాన్ని సందర్శించి, అల్పాహారం సరిగ్గాలేదని, అదే ఆహారాన్ని మధ్యాహ్నానికి బాక్స్‌ల్లో పట్టుకుంటున్నట్లు తెలిపారు.

ఎలా ఉన్నా తినాల్సిందే..

గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం రూ.వేల కోట్లు నిధులు ఖర్చు వెచ్చించి పోషకాహారం అందించేందుకు మెనూ కూడా రూపొందిస్తుంది. ఇందులో బలవర్ధకమైన ఆహారం ఉండేలా చూస్తున్నారు. అయితే ఇవేమి గిరిజన విద్యార్థులకు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో వసతిగృహ సంక్షేమ అధికారులు తమ ఇష్టానుసారంగా భోజనాలు తయారు చేసి వడ్డిస్తున్నారని, అవి బాగున్నా.. లేకున్నా తినాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బాలికలు, మహిళల వసతిగృహాల్లో అధికారులు ఒక అడుగు ముందుకేసి భోజనం బాగాలేదంటే వసతిగృహంలో అడ్మిషన్ క్యాన్సిల్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

బియ్యం బాగాలేదని సాకులు..

ఎన్నెస్పీ క్యాంపులో భోజనం సక్రమంగా ఉండడం లేదని విద్యార్థులు చేస్తున్న ఫిర్యాదులతో విద్యార్థి సంఘాల నాయకులు వసతిగృహాలను సందర్శించగా.. అధికారులు పరిశీలించేందుకు వెళ్లారు. అయితే వసతిగృహంలో అన్నం సరిగ్గా లేకపోవడానికి బియ్యం బాగాలేకపోవడమే కారణమని సాకులు చూపే ప్రయత్నం చేస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ వసతిగృహాలన్నింటికీ ఒకే ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుండగా.. ఆ వసతిగృహంకు మాత్రం బియ్యం సక్రమంగా రావడం లేదని చెప్పడం.. అధికారులు వ్యవహరిస్తున్న తీరు బహిర్గతమవుతుందని సంఘాల నేతలు పేర్కొంటున్నారు. అధికారులు వార్డెన్ల నుంచి కమీషన్లు తీసుకుంటున్నందునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోయినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సగానికి పైగా చెత్త డబ్బాలోకే..

గిరిజన శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాల్లో భోజనం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు తినలేక సగానికి పైగా చెత్త డబ్బాల్లోనే వేస్తున్నారు. వర్కర్లు, వార్డెన్లు తమ పనిని త్వరగా ముగించుకునేందుకు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో విద్యార్థులకు అందించాల్సిన భోజనానికి సంబంధించిన వంట నాణ్యత లేకుండా ఒకేసారి వండి పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు వసతిగృహాల్లో భోజనం అంటేనే భయపడుతున్నారని, ఆకలి తట్టుకోలేక జుమాటో, స్విగ్గి లాంటి యాప్‌ల ద్వారా భోజనం ఆర్డర్ చేసుకొని తెప్పించుకొని తింటున్నారన్న ప్రచారం విద్యార్థి సంఘాల్లో జరుగుతుంది.

చర్యలు తీసుకుంటాం..



ఎన్నెస్పీ క్యాంపులో భోజనం బాగాలేదని విద్యార్థులు ఆందోళన చేసిన విషయం నా దృష్టికి వచ్చింది.వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడాలని ఏటీడీఓను ఆదేశించా. భోజనం సక్రమంగా లేదని తేలితే వార్డెన్లపై చర్యలు తీసుకుంటాం.

– పి.కృష్ణానాయక్, డీడీ, గిరిజన సంక్షేమశాఖ

అధికారుల అలసత్వంతోనే..



గిరిజన సంక్షేమ వసతిగృహంలో అధికారుల అలసత్వంతో వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదు. ఆకలితో పెట్టుకున్న అన్నాన్ని కూడా తినలేక చెత్త డబ్బాల్లో వేస్తున్నారు.

– ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి

కనీస వసతులు కల్పించకపోవడం దారుణం



విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో గల గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అల్లిక వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం వర్షాలకు కురుస్తుండడంతో విద్యార్థినులు నానా అవస్థలు పడుతున్నారని, మంచాలు లేక నేలపైనే పడుకోవాల్సి వస్తోందన్నారు. 500 మందికి పైగా విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడం దారుణమని పేర్కొన్నారు. బీఎస్పీ విద్యార్థినులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగుకు చేరిన వైద్యుల సంఖ్య..

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేసి డిప్యూటేషన్‌పై వెళ్లిన దంత వైద్యుడు మురళి శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది సీహెచ్‌సీలో దంత వైద్యుడిగా విధులు నిర్వహించి డిప్యూటేషన్‌పై వెళ్లి తిరిగి శుక్రవారం మళ్లీ విధుల్లో చేరారు. మొత్తం 19 మంది వైద్యులు ఉండాల్సిన దవాఖానాలో దశల వారీగా వైద్యులు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. దీంతో నేలకొండపల్లి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల సంఖ్య నాలుగుకు చేరింది.

పైపులకు లీకేజీ ఉండొద్దు..



మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పైపులకు లీకేజీ లేకుండా మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేఎంసీ సమావేశ మందిరంలో పంపు ఆపరేటర్లు, లైన్‌మెన్‌లతో మంచినీటి సరఫరా, పైపుల లీకేజీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డివిజన్ వారీగా లీకేజీ సమస్యలతో పాటు నీటి సరఫరాకు కలుగుతున్న ఇబ్బందులను వివరించి చెప్పిన మరమ్మతులకు ఇచ్చిన గడువులోగా వాటిని పరిష్కరించకుంటే చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఎంఈ కృష్ణలాల్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల తొలగింపుపై ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: గెస్ట్ లెక్చరర్లను తొలగించడం సరైందికాదని పేర్కొంటూ పీడీఎస్‌యూ,పీవైఎల్ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఉమాశంకర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్లు అందరిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి బేతంపుడి నాగరాజు, మనోజ్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సాగర్, ఆర్కే, నాగరాజు, ప్రభు, అర్జున్, జస్వంత్, పాల్గొన్నారు. అదే విధంగా గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని కోరుతూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తుడుం ప్రవీణ్, నాయకులు పర్వీన్, విజయ్, ఎర్రసాయి, అజయ్ పాల్గొన్నారు.

దోపిడీ పాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న పుల్లయ్య

నేలకొండపల్లి: ప్రజలపై జరుగుతున్న దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీ.వై.పుల్లయ్య అన్నారు. మండలంలోని అనాసాగారం గ్రామంలో శుక్రవారం బి.వెంకటేశ్వర్లు వర్ధంతి నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలపై సాగుతున్న దోపిడీ నిర్మూలనకు విప్లవమే ప్రధాన మార్గమని పేర్కొన్నారు.సమసమాజ స్థాపన కోసం ప్రతీ ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమించటమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, పార్టీ మండల కార్యదర్శి చిర్రా భిక్షం, మండల నాయకులు దామాల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి నిధులు మంజూరు చేయాలి

తిరుమలాయపాలెం: గృహలక్ష్మి పథకం కింద నిధులు మంజూరు చేసి పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జూపెడలో జరిగిన పార్టీ జోనల్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేటికీ కార్యాచరణ చేపట్టలేదని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఇళ్లు లేని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సాదాబైనామాకు దరఖాస్తు చేస్తున్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నర్సయ్య, నాగటి సురేష్, కోట ఉపేందర్‌రెడ్డి, సిద్దుల వెంకన్న, యశోద, సుశీల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న ధనియాకుల హన్మంతరావు

కామేపల్లి(కారేపల్లి): గోవింద్రాల సంఘటనలు పునరావృతమయితే.. ప్రతి దాడులు తప్పవని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుంతరావు కాంగ్రెస్ పార్టీ నాయకులను హెచ్చరించారు. శుక్రవారం ముచ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సరికాదని, నాలుగేళ్లలో కామేపల్లి మండలంలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సునీతారాందాస్, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ ఆంతోటి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం..



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎస్సీ సంక్షేమశాఖ బాలుర వసతిగృహం (బి)లో సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మామిళ్లగూడెం పీహెచ్‌సీ వైద్యుడు వి.సాయితేజ విద్యార్థులను పరీక్షించి, వారికి అవసరమైన మందులను అందజేశారు. వర్షాకాలం సీజన్‌లో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పొడి దుస్తులను ధరించాలని సూచించారు. అనంతరం వసతిగృహంలో విద్యార్థులకు అవసరమైన సాధారణ మందులను సంక్షేమ అధికారికి వైద్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఐ.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం ఎస్.దయామని, కె.హేమలత, ఆశా వర్కర్ డి.అరుణ, వసతిగృహ నాల్గవతరగతి సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంలోనూ ఆగని కార్మికుల సమ్మె

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ వర్కర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం జోరు వానలోనూ కొనసాగింది. 16వ రోజు సమ్మెకు పలు పార్టీల నాయకులు, పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ మద్దతు ఇస్తామని తెలిపారు. కాగా, నేలకొండపల్లిలో చేపట్టిన సమ్మెలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు కార్మికులకు అందించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ శ్రేణులు సంఘం ప్రతినిధులకు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: కార్మికులకు ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రఘునాథపాలెం: సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పొంగులేటి పరామర్శ

ఖమ్మం రూరల్ : తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూరల్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య కుమారుడు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ముత్తగూడెం గ్రామానికి చెందిన యరకల కౌశిక్ రెడ్డి నాయనమ్మ యరకల కౌశల్య ఇటీవల మృతిచెందగా 55వ డివిజన్ విజయనగర్ కాలనీలో వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు మద్ది కిశోర్ రెడ్డి, అజ్మీరా అశోక్ నాయక్, గోనె భుజంగ రెడ్డి, మద్ది వీరారెడ్డి, కేతినేని వేణు తదితరులు ఉన్నారు.

నేడు పర్యటన..

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో శనివారం పర్యటించనున్నారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 11గంటలకు అశ్వారావుపేటలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు, మధ్యాహ్నం 3 గంటలకు సత్తుపల్లిలో బైక్ ర్యాలీతో పాటు సిద్దారం రోడ్‌లో నూతన క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 4 గంటలకు పలువురి కాంగ్రెస్ నేతలతో సమక్షంలో పార్టీలోకి వివిధపార్టీల నుంచి నాయకులను ఆహ్వానిస్తారని చెప్పారు.

కార్మికుడి కుటుంబానికి రూ.1.03 లక్షల సాయం



నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్-3 సెక్షన్ పరిధిలో ఉన్న ఐటీ హబ్ వద్ద జూన్ 1న విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మరణించిన విద్యుత్ కార్మికుడు(అన్‌మ్యాన్డ్) షేక్ యాకూబ్ పాషా భార్య రెహెనా బేగంకు శుక్రవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) ద్వారా రూ. 1.03 లక్షలను అందజేశారు. అనంతరం యాకూబ్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించాక మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇల్లెందు క్రాస్ రోడ్‌లో ఉన్న విద్యుత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ కార్యదర్శి టి.శేషగిరిరావు, యూనియన్ నాయకులు జీఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరరావు,కె.సీతారామయ్య,డి.రామయ్య, టి.శ్రీనివాస్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను శిక్షించాలి

మణిపూర్‌లో జరిగిన హృదయ విదారక ఘటనపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకింది. రాజకీయ పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు శుక్రవారం రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. పలుచోట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మణిపూర్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ఏలుబడితో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అనుమానుషంగా ప్రవర్తించినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న అల్లర్లను అదుపు చేయలేని బీజేపీ ప్రభుత్వం వెంటనే వైదొలగాలని నినదించారు.

– సాక్షి నెట్‌వర్క్



జెడ్పీసెంటర్‌లో వామపక్ష, మహిళ, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన మానవహారం



ఖమ్మం సహకారనగర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

24న న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఖమ్మంలీగల్: మణిపూర్ సంఘటనల నేపథ్యాన బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ జనరల్ సెక్రటరీ మన్నేపల్లి బసవయ్య తెలిపారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా, ఈ సమావేశంలో మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలపై చర్చించినట్లు తెలిపారు. న్యాయవాదులు విధుల బహిష్కరణలో పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా డ్రై డే..

పరిసరాలు పరిశుభ్రతే లక్ష్యంగా చేపడుతున్న డ్రైడే కార్యక్రమం గ్రామాల్లో ముమ్మరంగా సాగింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి సైడ్ డ్రెయిన్లలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు పారక రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా మారాయి. దీంతో పాలకులు శుక్రవారం డ్రెయిన్లు శుభ్రం చేయించడంతో పాటు నివాసాల్లోని పాత టైర్లు, గాబులు, పాత డబ్బాల్లో నీటి నిల్వలు లేకుండా చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

– రఘునాథపాలెం



నేలకొండపల్లి: మంగాపురంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సర్పంచ్ భూక్యా సుధాకర్



వేపకుంట్ల పంచాయతీలో డ్రెయిన్లను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ ధారాశ్యాం



కామంచికల్‌లో నివాసాల మధ్య నిల్వ నీటిని పారబోయిస్తున్న ఉపసర్పంచ్ బి.ప్రభాకర్